నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్


I | హైదరాబాద్, బుధవారం 26 ఫిబ్రవరి 2025 | HYDERABAD




కాంగ్రెస్ సర్కారు అబద్ధాలతో కాలం వెల్లబుచ్చుతున్నదని.. 14 నెలలు గడిచినా సర్కారు హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో మంగళ వారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అబద్ధాలతో ప్రభుత్వాన్ని నడుపుతూ ప్రజల్ని మోసం చేస్తున్నదని మండిపడ్డారు.
-పహాడి షరీఫ్, ఫిబ్రవరి 25



రైల్వే గేట్ల వద్ద ఆర్‌యూబీలను నిర్మించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళ వారం సికింద్రాబాద్ లోని రైల్వే కార్యాలయంలో ఉన్నతాధికారులతో చర్చించారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మచ్చ బొల్లారం డివిజన్ జనప్రియ వద్ద ఇది వరకే ప్రతిపాదించిన ఆర్‌యూబీకి నిధులు మంజూరు చేయాలని కొత్తబస్తీలోని నాలా ప్రవాహానికి అడ్డుగా ఉన్న రైల్వే టన్నెల్‌ను తొలగించి పెద్ద టన్నెల్‌ను ఏర్పాటు చేస్తే ప్రవాహం పెరుగుతుందన్నారు. ఆర్‌కేపురం వద్ద అదనపు ఫ్లైఓవర్ పనుల నిర్మాణం త్వరగా చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. -మల్కాజిగిరి, ఫిబ్రవరి 25



## శంభో శంకర..

సిటీబ్యూరో: హరహర శంభో శంకర అంటూ.. ఆ శివుడిని మనసారా కొలిచేందుకు భక్తులు సిద్ధమయ్యారు. బుధవారం శివరాత్రిని పురస్కరించుకొని నగరవ్యాప్తంగా శివాలయాలు ముస్తాబయ్యాయి. మరోవైపు కీసరగుట్ట, ఏడుపాయల, బీరంగూడ జాతరలకు సిటీ నుంచి బస్సులు అందుబాటులో ఉన్నాయి. కీసరగుట్టకు 285 , ఏడుపాయలకు 125, బీరంగూడకు 30 బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ వెల్లడించింది. మరింత సమాచారం కోసం 9959226160, 9959226154 నంబర్లను సంప్రదించాలని సూచించింది.

## ముందుకుసాగని ఎల్ఆర్ఎస్

### మేడ్చల్ జిల్లావ్యాప్తంగా దరఖాస్తులు 1.60 లక్షలు..

### పరిశీలించింది 55,942..ఆమోదించినవి 5,820 మాత్రమే

మేడ్చల్, ఫిబ్రవరి 25(నమస్తే తెలంగాణ): భూ క్రమబద్ధీకరణ ముందుకు సాగడం లేదు. లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్)దరఖాస్తుల పరిశీలనపై అధికారులు అంతగా దృష్టి సారించడం లేదు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం ప్రారంభమై నెలలు గడుస్తున్నా దరఖాస్తుల పరిశీలన పూర్తికావడం లేదు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా భూక్రబద్ధీకరణ కోసం 1,60,338 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇప్పటి వరకు 55,942 దరఖాస్తులను మాత్రమే పరిశీలించారంటే అధికారులు చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమంటూ దరఖాస్తుదారుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంతో ఆశగా క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తుదారులు వేచి చూస్తున్న అధికారులు నామ మాత్రంగానే దరఖాస్తుల పరిశీలనను కొనసాగిస్తున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం మూలంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని దరఖాస్తుదారులంటున్నారు. అనుమతి లేకుండా అక్రమ వెంచర్లలో విక్రయించిన ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు వీలు కల్పించిన విషయం తెలిసిందే. రెవెన్యూ, నీటిపారుదల, మున్సిపల్‌శాఖల అధికారులు సంయుక్తంగా దరఖాస్తులను పరిశీలిస్తున్నారు.

#### ఆమోదించినవి 5,820 మాత్రమే..

జిల్లాలో 1, 60, 338 దరఖాస్తులు ఉంటే ఇప్పటి వరకు 55,942 దరఖాస్తులు పరిశీలించి 5,820 దరఖాస్తులను మాత్రమే ఆమోదించారు. దరఖాస్తులను పరిశీలించిన వాటిలో 1492 తిరస్కరించగా, 17,812 దరఖాస్తుల్లో సరైన ధ్రువపత్రాలు లేవని నిర్ధారించారు. మరో 26,798 దరఖాస్తులు ప్రొహిబిటెడ్‌లో ఉన్నట్లు అధికారులు తేల్చారు. అయితే మరో 1,06,336 దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది. వీటి పరిశీలనకు ఇంకా ఎంత కాలం పడుతుందోనని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

#### కావాలనే తిరస్కరిస్తున్నారా..?

క్రమబద్ధీకరణలో కావాలనే అత్యధికంగా దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు సూచించిన అన్ని ధ్రువపత్రాలను పొందుపరిచినా..తిరస్కరణకు గురికావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో ఆమోదించిన 5,820 దరఖాస్తులకు ఇప్పటి వరకు 2,165 మంది మాత్రమే ఫీజులు చెల్లించగా, 3,655 మంది ఫీజులు చెల్లించాల్సి ఉంది. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ త్వరగా చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అయితే దరఖాస్తుదారులు కావాల్సిన పత్రాలను జత పరచకపోవడం వల్లే దరఖాస్తుల పరిశీలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. దరఖాస్తుదారులకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు హెల్ప్‌డెస్కలను మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ హెల్ప్ డెస్కలలో తమకు ఎలాంటి న్యాయం జరగడం లేదని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు.

# ఎంటమాలజీలో నయా దోపిడీ

### సెలవుల్లో ఉన్న కార్మికులు, ఉద్యోగుల జీతాలు క్లెయిమ్

### తమ జేబులో వేసుకున్న కాంట్రాక్టర్లు, కొందరు అధికారులు

### పనిచేయని సెలవు దినాల్లో సైతం..

### బిల్లులు పెట్టి జీతాలు కొట్టేసిన వైనం..

### అంతర్గత విచారణ జరుపుతున్న ఉన్నతాధికారులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ ) : జీహెచ్ఎంసీలో కాదేది అవినీతికి అనర్హం అన్నట్లు దోపిడీపర్వం సాగుతోంది. తాజాగా ఎంటమాలజీ విభాగంలో నయా దందా వెలుగులోకి రావడం బల్దియాలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో ఉద్యోగుల విధుల హాజరు పారదర్శకంగా ఉండాలని భావించి బయో మెట్రిక్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే బయో మెట్రిక్ విధానం ఆమలు కాక ముందు కొంతమంది కాంట్రాక్టర్లు, మరికొందరు అవినీతి అధికారులు కలిసి జీహెచ్ఎంసీ ఖజానాను లూటీ చేశారు. కొన్ని విభాగాల్లో ఉద్యోగులు లేకపోయినా ఉన్నట్లుగా చూపించి.. డబ్బులు కొట్టేసిన అధికారులు, కాంట్రాక్టర్లు మరి కొన్ని విభాగాల్లో ఉద్యోగులు, కార్మికులు సెలవుల్లో ఉన్న బిల్లులు పెట్టే సమయంలో వారు నెలలో పూర్తి రోజులు పని చేసినట్లుగా చూయించి బల్దియా ఖజానా నుంచి బిల్లులు డ్రా చేశారు. అలా డ్రా చేసిన డబ్బులను సంబంధిత కార్మికులు ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయకుండా నేరుగా కాంట్రాక్టర్ అధికారులు పంచుకున్నారు. కూకట్‌పల్లి, ఎల్బీనగర్, చార్మినార్ జోన్లలోని ఎంటమాలజీ విభాగంలో 33 మంది ఉద్యోగుల జీతాల చెల్లింపులలో అక్రమాలు జరిగాయన్న చర్చపై అంతర్గత విచారణ జరుగుతున్నట్లు తెలిసింది. మచ్చుకు కొన్ని పరిశీలిస్తే...కూకట్‌పల్లి జోన్‌లో అసిస్టెంట్ ఎంటమాలజీ (సర్కిల్-25) 2022 ఫిబ్రవరి 21 నుంచి 20-3-22వ తేదీ వరకు 12 రోజుల పాటు లీవ్‌లో ఉండగా.. పూర్తి స్థాయి జీతాన్ని డ్రా చేశారు. ఎల్బీనగర్ జోన్‌లో అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ (మహిళా ఉద్యోగి) ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగం చేస్తుండగా.. 21-8-23 నుంచి 20-9-23 రోజుల వరకు చికిత్స కోసం సెలవు పెట్టారు. దవాఖాన బిల్లును క్లెయిమ్ చేసుకునేందుకు వెళ్లగా పూర్తి స్థాయి జీతం తీసుకున్నట్లుగా ఈపీఎఫ్ విభాగం తేల్చింది. మెడికల్ లీవ్‌లో ఉన్నానని సదరు ఉద్యోగి చెప్పడం, సంబంధిత ఏజెన్సీని నిలదీయగా..ఉద్యోగం కావాలా? డబ్బులు కావాలా? అని సదరు ఏజెన్సీ బెదిరించింది. కూకట్‌పల్లిలో జోన్‌లో మరో అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్‌కు కొవిడ్ సెలవు రోజుల్లోనూ పూర్తి జీతాన్ని డ్రా చేయడం అధికారులకే చెల్లింది. అటెండెన్స్ రిజిస్టర్ లీవ్‌లు ఉన్నప్పటికీ కార్మికుల పేరిట పూర్తి జీతాలు అందినంత దండుకున్నారని ఆసక్తికర చర్చ జరుగుతున్నది. ఎంటమాలజీ, శానిటేషన్ కంప్యూటర్ ఆపరేటర్లు, సెక్యూరిటీ విభాగంలో ఇలాంటి అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నట్లు ఉద్యోగుల్లో చర్చ జరుగుతున్నది. ముఖ్యంగా అనారోగ్యం, ప్రమాదాలు జరిగినప్పుడు, మెటర్నటీ సెలవుల్లో ఉన్న మహిళా ఉద్యోగుల జీతాలతో పాటు కొవిడ్ సెలవులో ఉన్న ఉద్యోగుల జీతాలను సైతం కాంట్రాకర్లు, కొందరు అధికారులు కలిసి తమ జేబుల్లో వేసుకున్నట్లు తెలిసింది.

#### అటెండెన్స్ వేసి..

ఎంటమాలజీ విభాగంలో పనిచేసే అసిస్టెంట్ ఎంటమాలజిస్టుల (ఏఈ) జీతాలను ప్రధాన కార్యాలయంలో పనిచేసే ఒక ఉన్నతాధికారి, జూనియర్ అసిస్టెంట్ కంప్యూటర్ ఆపరేటర్లు కలిసి డ్రా చేసినట్లు సమాచారం. ఏఈలు సెలవుల్లో ఉండి పని చేయని రోజులలో సైతం అటెండెన్స్ వేసి జీతాలు డ్రా చేశారన్నది ప్రధాన ఆరోపణ. కొంతమంది అసిస్టెంట్ ఎంటమాలజిస్టులు ఆరోగ్య సమస్యల కారణంగా సెలవులు పెట్టి నాలుగు ఐదు వారాలు విధులకు హాజరు కాలేదు. మరికొందరు యాక్సిడెంట్ కారణంగా నెల వరకు విధులకు అటెండ్ కాలేదు. కొవిడ్ సమయంలో కొవిడ్ బారిన పడ్డ కొంత మంది ఉద్యోగులు సైతం సెలవులు పెట్టగా వాటిని కూడా పని చేసినట్లు అటెండెన్స్ వేసుకొని కాంట్రాక్టర్లు ప్రధాన కార్యాలయం అధికారులు ఎంచక్కా కొట్టేసినట్లు ఉద్యోగుల్లో చర్చ జరుగుతున్నది.

#### సమగ్ర విచారణ జరిపిస్తే...

అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్‌లకు ప్రతి నెల వేతనం చెల్లించే ఓ సెక్యూరిటీ సర్వీసెస్, ఎంటమాలజీ విభాగంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, మరో సీనియర్ అధికారి కలిసి వారి జీతాలు డ్రా చేయడంలో కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. 33 మంది అసిస్టెంట్ ఎంటమాలజిస్టుల్లో నెలల తరబడి ఒక్కరూ కూడా సెలవుపై వెళ్లినట్లు చూపించి పూర్తి జీతాన్ని నొక్కేసారంటే కాంట్రాక్టర్లు, అధికారులు ఎంత ఆర్గనైజ్డ్ గా పనిచేశారో అర్థం చేసుకోవచ్చు. కొవిడ్ టైమ్ 2020 గడిచిన ఐదేండ్లుగా ఒక కాంట్రాక్ట్ ఏజెన్సీ, ప్రధాన కార్యాలయంలోని అధికార గణం ఉద్యోగుల సెలవులను పైసల రూపంలోకి మార్చుకున్నారని తెలుస్తున్నది. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్, చార్మినార్ జోన్ల పరిధిలో అసిస్టెంట్ ఎంటమాలజిస్టుల జీతాలను ఈ విధంగా కాంట్రాక్టర్లు తమ ఖాతాకు మళ్లించుకున్నారని, 21 ఆగస్టు 23 నుంచి వరుసగా ఐదు నెలల పాటు ఎంటమాలజీ విభాగంలో జరిగిన నెలవారీ వేతనాలపై సమగ్ర విచారణ జరిపిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్న డిమాండ్‌లు వ్యక్తమవుతున్నాయి.

## బల్దియాలో అదనపు కమిషన్ బదిలీ



సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ అడ్మిన్ విభాగానికి అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న నళిని పద్మావతిపై బదిలీ వేటు పడింది. ఆమె స్థానంలో మరో అదనపు కమిషనర్ అయిన కె. వేణుగోపాల్‌కు అదనపు బాధ్యతలు ఇస్తూ.. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.




అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చ్ 8న హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో జరిగే హైదరాబాద్ సిటీ పోలీస్ 'రన్ ఫర్ యాక్షన్ 2025' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను, రిజిస్ట్రేషన్ లింక్‌ను సీపీ సీవీ ఆనంద్ మంగళవారం తన కార్యాలయంలో ఉమెన్ సేఫ్టీ డీసీపీ లావణ్యతో కలిసి ఆవిష్కరించారు. -సిటీబ్యూరో

## ఎండలు మండుతున్నాయి.. మీటర్లు తిరుగుతున్నాయి

### పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. రికార్డ్ స్థాయిలో విద్యుత్ డిమాండ్




**సిటీబ్యూరో, ఫిబ్రవరి 25(నమస్తే తెలంగాణ):** ఎండలు మండిపోతున్నాయి. గ్రేటర్‌లో పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు దాటిపోతున్నాయి. ఈ ఉష్ణోగ్రతలకు ఉక్కపోత తోడవడంతో కరెంట్ మీటర్లు గిరగిర తిరుగుతున్నాయి. దీంతో విద్యుత్ వినియోగం డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. ఫిబ్రవరి మొదటి రెండువారాలు సగటున డిమాండ్ 60 మిలియన్ యూనిట్లు నమోదు కాగా, తాజాగా 73 మిలియన్ యూనిట్లకు చేరింది.

#### ఫిబ్రవరిలోనే ఏప్రిల్ డిమాండ్..

సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. కానీ గతంలో ఏప్రిల్‌లో నమోదైన గరిష్ఠ డిమాండ్ 3435 మెగావాట్లు దాటి ప్రస్తుతం ఈ ఫిబ్రవరిలో 3455 మెగావాట్ల డిమాండ్ నమోదవుతోంది. ఈ నేపథ్యంలో మార్చి, ఏప్రిల్‌ల్లో ఏ మేరకు డిమాండ్ నమోదవుతుందోనన్న ఆందోళనలో సిబ్బంది ఉన్నారు. మే మొదటి వారానికి రోజుకు సగటున 100 ఎంయూలు దాటే అవకాశం ఉన్నట్లుగా డిస్కం అంచనా వేస్తోంది. విద్యుత్ వాడకం పెరుగుతున్న నేపథ్యంలో టీజీఎస్‌పీడీసీఎల్ ఇంజినీర్లలో ఆందోళన మొదలైంది. వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం డిస్కం ముందస్తు లైన్ల పునరుద్ధరణ చర్యలు చేపట్టింది.

#### లైన్ క్లియరెన్స్ ఆపేనా..

సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు , డీటీఆర్‌లలో ఆయిల్ లీకేజీల నియంత్రణ, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, లూజులైన్లను సరిచేయడం, దెబ్బతిన్న ఇన్సులేటర్లను మార్చడం, ఎర్తింగ్ సిస్టం పకడ్బందీగా ఉండేలా చర్యలు చేపట్టారు. జనవరి చివర, ఫిబ్రవరి మొదటి వారంలో పూర్తి చేయాల్సిన లైన్ క్లియరెన్స్ పనులు ఇంకా గ్రేటర్ వ్యాప్తంగా జరుగుతూనే ఉన్నాయి. మార్చి మొదటివారంలో ఇంటర్, టెన్త్ పరీక్షలు ఉన్న నేపథ్యంలో ఈ పనులు నిలిపివేస్తారా.. లేక సమ్మర్ మొత్తం చేస్తారా అంటూ స్థానికుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బందికి వ్యంగ్యంగా ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

#### క్షేత్రస్థాయిలో సీఎండీ పర్యటన

సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులను పూర్తిచేయడంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఇంజినీర్లతో పాటు క్షేత్రస్థాయిలో సీఎండీ ముషారఫ్ ఫరూఖీ పర్యటిస్తున్నారు. ప్రతిరోజూ సమీక్షలు నిర్వహిస్తూ ఫైల్స్ క్లియరెన్స్ లేని చోట సీరియస్ అవుతున్నారు. పనులు పూర్తికాని చోట వెంటనే పూర్తి చేయాలని చెబుతున్నారు. అయితే శివారు ప్రాంతాల్లో కనెక్షన్లు పెరగడం, డిమాండ్ పెరుగుతుండడంతో లోడ్ అధికమవుతోంది.

## సర్కారు స్థలం..కబ్జాకు యత్నం..



బంజారాహిల్స్,ఫిబ్రవరి 25: బంజారాహిల్స్ రోడ్ నం. 11లోని అంబేద్కర్ నగర్ బస్తీలో నాలాను ఆనుకొని సుమారు 500 గజాల ఖాళీ ప్రభుత్వం స్థలం ఉంది. ఈ స్థలాన్ని ఆనుకొని ఉన్న భవన యజమాని మంగళవారం స్థలంలో బ్లూషీట్లు వేసేందుకు యత్నించగా, స్థానికులు అడ్డుకోవడంతో వెనక్కి తగ్గాడు. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు షేక్‌పేట మండల అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు.

# ఆడపిల్ల 3 లక్షలు.. పిల్లాడు 5 లక్షలు

### గుజరాత్ టూ హైదరాబాద్ పసిబిడ్డల అక్రమ రవాణా

### పుట్టిన ఒకటి రెండు రోజుల్లోనే విక్రయాలు

### ముఠా సభ్యులతో పాటు పిల్లలను కొన్నవారు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): పుట్టిన ఒకటి రెండు రోజుల్లోనే ఆగ, మగ తేడా లేకుండా పసి కందులను హైదరాబాద్‌కు తెచ్చి విక్రయిస్తున్న ముఠాను రాచకొండ మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. అమ్ముతున్న వారితో పాటు పిల్లలను కొనుగోలు చేసిన వారు అరెస్టయిన వారిలో ఉన్నారు. మంగళవారం పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. కుత్బుల్లాపూర్‌కు చెందిన కోల కృష్ణవేణి సోషల్‌మీడియాలో చిన్న పిల్లలను దత్తత తీసుకోవడానికి విక్రయించే వారి గురించి సోషల్‌మీడియాలో శోధించడంతో ఢిల్లీకి చెందిన మనోజ్ అనే వ్యక్తి 2024లో పరిచయమయ్యాడు. అతడి ద్వారా మగశిశువును రూ. 5లక్షలకు కొనుగోలు చేసింది. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు మనోజ్ ముఠా ఆ పసికందును తీసుకొచ్చి విక్రయిస్తుండగా గోపాలపురం పోలీసులు పట్టుకొని కృష్ణవేణిని అరెస్ట్ చేశారు.

#### రైల్లో తీసుకొచ్చి..

గోపాలపురం కేసులో జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత అప్పటికే కృష్ణవేణితో పరిచయం ఉన్న కొత్తపేటకు చెందిన బట్టు దీప్తి, సికింద్రాబాద్‌కు చెందిన సంపత్‌కుమార్‌లు పిల్లలను విక్రయిస్తే మంచి సంపాదన ఉంటుందంటూ సూచించారు. దీంతో కృష్ణవేణి మరోసారి సోషల్‌మీడియాలో శోధించడంతో గుజరాత్ అహ్మదాబాద్‌కు చెందిన వందన అనే ఒక మహిళ పరిచయమైంది. తాను గుజరాత్ నుంచి పసిపిల్లలను తన మనిషులతో పంపిస్తానని, వాళ్లు తెచ్చిమీకు అప్పగిస్తారని, ఆడ బిడ్డకు రూ. 1.5 లక్షలు, మగ బిడ్డకు రూ. 2.5 లక్షలు తనకు ఇవ్వాలంటూ ఒప్పందం చేసుకున్నారు. దీంతో కృష్ణవేణి టీమ్ మరోసారి ఈ అక్రమ దందాను ప్రారంభించింది. అహ్మదాబాద్‌కు చెందిన సునీత సుమన్, సావిత్రి దేవి అక్కడి నుంచి పసి పిల్లలను రైల్లో తీసుకొచ్చి మీకు అప్పగిస్తారని చెప్పారు. దీంతో ఈ ఏడాది జనవరి 28 నుంచి ఫిబ్రవరి 25వ తేదీ వరకు ఇద్దరు ఆడ, ఇద్దరు మగ పసి పిల్లలను వందన పంపించింది.

ఈ పసి కందులను కృష్ణవేణి తన గ్యాంగ్ సభ్యులైన దీప్తి, సంపత్‌కుమార్‌లతో కలిసి ఏపీ, తెలంగాణలో నలుగురు పసికందులను విక్రయించారు. ఇందులో శారద, ఉమారాణి, జయశ్రీ, శ్రాణ్, సోని, కీర్తిలు మధ్యవర్తులుగా వ్యవహరించి ఆడ బిడ్డను రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షలు, మగ శిశువును రూ. 4 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పిల్లలు కావాల్సిన వారికి విక్రయించారు.

#### చైతన్యపురిలో పట్టుబడ్డ గ్యాంగ్..

పసి పిల్లలను విక్రయిస్తున్నారని మల్కాజిగిరి ఎస్ఓటీ డీసీపీ రమణారెడ్డి, అదనపు డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, ఇన్‌స్పెక్టర్ జానయ్యలకు విశ్వసనీయ సమాచారం అందడంతో చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ల బృందంతో కలిసి మంగళవారం చైతన్యపురి బస్‌స్టాప్ వద్ద సీడబ్ల్యూసీ(చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ) సభ్యులతో కలిసి అక్కడకు వెళ్లారు. కోల కృష్ణవేణి, అహ్మదాబాద్‌కు చెందిన సావిత్రిదేవి, గాంధీ దవాఖానలో ఔట్‌సోర్సింగ్‌లో వార్డు బాయ్‌గా పనిచేస్తున్న సంపత్‌కుమార్‌లు మగశిశువుతో అనుమానాస్పదంగా పట్టుబడ్డారు. ఈ ముగ్గురిని విచారించడంతో మరో ముగ్గురు పసిబిడ్డలను కూడా నెల రోజుల వ్యవధిలో విక్రయించినట్లు వెల్లడించారు. దీంతో ఆ పసిబిడ్డలకు సంబంధించిన వివరాలు సేకరించి నలుగురు పసి బిడ్డలను గుర్తించి వారిని సీడబ్ల్యూసీకి అప్పగించారు. కృష్ణవేణి, సావిత్రిదేవి, సంపత్‌కుమార్‌లు ఈ ముఠాకు చెందిన బట్టు దీప్తి, శ్రాణ్‌కుమార్, అంగోత్ శారదలతో పాటు పిల్లలను కొనుగోలు చేసిన విజయవాడకు చెందిన ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫిసర్‌గా పనిచేస్తున్న నాగ వెంకట పవన్ భగవాన్ ఆయన భార్య రమా శ్రావణి, ఇంటర్‌నెట్ కనెక్షన్ ఆపరేటర్ సైదాబాద్ కాలనీకి చెందిన తెప్పల వినయ్‌కుమార్, ఆయన భార్య స్వాతి, మహబుబాబాద్ జిల్లా, కేసముద్రానికి చెందిన లింగాల రమేశ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు.

#### చట్టప్రకారం దత్తత తీసుకోవాలి

అహ్మదాబాద్ నుంచి పుట్టిన ఒకటి రెండు రోజుల్లోనే పిల్లలను తీసుకొని ట్రైన్‌లో హైదరాబాద్‌కు తీసుకొస్తున్నారని సీపీ సుధీర్‌బాబు తెలిపారు. పిల్లలకు సంబంధించిన నకిలీ సర్టిఫికెట్లను కూడా ఈ ముఠా తయారు చేస్తోందన్నారు. చట్టప్రకారం పిల్లలను దత్తత తీసుకోవాలని సూచించారు. అలాకాకుండా అక్రమ మార్గంలో పిల్లలను కొనుగోలు చేస్తే చట్టవిరుద్ధమని, కొనుగోలు చేసిన వారు కూడా నేరస్తులే అవుతారని చెప్పారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి వందన కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు.